

# కీర్తిశేషులు సంకు పాపారావు జ్ఞాపకాలు - ఒక వినతి

**"పోలీసోడు ఎలాటోడెరుగుదువా? కరెంట్ లాంటోడు. కొంటాక్టు సరీగుంటే అన్నిసుకాలూ ఇవ్వగల్డు. కాంటాక్టు గాని లూజై పోయిందంటే కాటేస్సేడన్నమాటే!"**

ఉపమా కాళిదాసస్య - అన్నారు కదా. ప్రకృతి గురించి, స్త్రీ అవయవ సౌందర్యం గురించి పూర్వకవులు వేసిన ఉపమలు అలవాటై పోయి వెగటు పుట్టించడం జరిగిన ఈ యుగంలో ఉపమా స్వభావ స్వరూపాలు మారవలసిన అవసరం వచ్చింది. రాచకొండ విశ్వనాథ శాస్త్రిగారి కథల్లో నవలల్లో పాత్రల ఆకారాలనీ అవస్థలనీ బొమ్మలు కట్టడానికి వాడిన ఉపమలు అధునాతన సాహిత్యంలో విలక్షణమైన ప్రయోగాలని చెప్పకోవచ్చు. ఇలాంటి విలక్షణమైన ప్రయోగాలు చేసి వచన రచనను ఆలంకారికంగా రూపొందించిన కథకులు కవులకోవలో చేరుతారన్నది నిస్సంశయం.

సంకు పాపారావు రచన చేపట్టి వుంటే ఎంతపాటి ఆదరణ పొందేవాడో ఊహించడం కష్టమే కాని, అతని ఉపమాలను యథాతథంగా లేక కొద్దిపాటి మార్పులతో రచనల్లో వాడుకోగలిగిన రచయితలు, అతని ధోరణిలో ఉపమించగలిగిన కొద్దిమంది రచయితలు ఆ కారణంగా గౌరవ ప్రఖ్యాతులు సాధించడం గత పాతిక ముప్ఫ య్యేళ్ళుగా జరుగుతోంది. ఒక ప్రాంతానికి, విశేషించి ఒక నగరానికి చెందినవాడు అయి వుండడంవల్ల అతని ప్రభావం అతికొద్ది మంది రచయితల పైనే పడింది. అతను రచయిత అయివుండి నట్లయితే అతని ఉపమలు పాఠకలోకం అందరికీ మూల రూపంలో ప్రామాణికంగా చేరి వుండేవి.

పాపారావు సాధారణంగా కవులు, రచయితలు, పత్రికా విలేకరులు, సాహితీ అభిమానులు - వీరి మధ్యనే మెసలేవాడు. స్వచ్ఛమూ నిర్భయమూ అయిన అతని పరిశీలనా శక్తి, జన పదానికి అతి చేరువలో వుండే అతని వ్యక్తీకరణ ధోరణీ, ఇంకా అనేక రకాల వ్యక్తుల్ని అతని వైపుకి ఆకర్షించాయి. న్యాయవాదులు, పారిశ్రామిక వేత్తలు, (చోటా) రాజకీయవాదులూ అతని అభి మానుల్లో జమ అయిన అతిముఖ్యుల్లో కొందరు.

ఎంతకొత్త సంగతినైనా పాపారావు చక్కగా విశ్లేషించ గలిగేవాడు. తనకంటే అనేక విధాలుగా మేధావులనీ మెరుగైన వారనీ ప్రయోజకులనీ అనిపించుకునే వాళ్ళలో ఒక్కరు కూడా పాపారావు వాగ్ధోరణికి ముగ్ధులు కాని వారు లేరు. రాజకీయ శాస్త్రం నుంచి రతి శాస్త్రం వరకు పాపారావు అవలోకనం చేసుకోని విషయం, చక్కని వ్యాఖ్యానం అందించని ఉపాఖ్యానం లేవంటే అతిశయోక్తికాదు.

నిశితమైన పరిశీలనా శక్తికీ యుక్తియుక్తమైన వ్యాఖ్యాన చాతుర్యానికీ తోడు, పాపారావుకి ఉండిన సెన్సాఫ్ హ్యూమర్, ఉపమా ప్రావీణ్యం, ఒకసారి అతని వచో రుచిని చవి చూసిన వారందరిలో, మళ్ళీ అతనిని ఎప్పుడు కలుస్తాం ఎక్కడ కలుస్తాం అనే ఆశతో ప్రకంపించేటట్లు చేశాయి. ఎప్పటికప్పుడు కొత్త కొత్త ఉపమలు వాడడం, తన శ్రోతల్ని అనుసరించి తన ధోరణిని మార్చుకునే స్థితికి దిగజారక పోవడం పాపారావు ప్రత్యేకతలు.

1987 డిసెంబర్ 5వ తేదీన తన 55వ ఏట అకాల మరణం పాలైన సంకు పాపారావు జ్ఞాపకాలను మిత్రులు కొందరు ఒక చిన్న పుస్తకంలో భద్రప రుద్దామని సంకల్పించారు. పాపారావును గూర్చి, పాపా రావు చెప్పిన మాటలను గూర్చి చెప్పగలిగిన వారు తమ రచనలను శ్రీ ఇస్మాయిల్, సి.టి.ఓ.- 3 శివాలయం వీధి, విజయవాడ - 520 001 అనే చిరునామాకు పంపగలరు.

*

## కాలమ్ దాటని కథ

ప్రఖ్యాత రచయిత రామనాథం రచనలంటే పాఠకులకు విపరీతమైన క్రేజ్. అతని నవల సీరియల్‌గా వేస్తున్న ఏ పత్రిక సర్క్యులేషనయినా ఖచ్చితంగా పెరిగి తీరాల్సిందే.

కొత్త కొత్త అయిడియాలు అతనికెలా వస్తాయో చాలామందికి తెలుసు. అయినా కథను బిగి సడలకుండా నడిపించడంలో అతనికతనే సాటి.

ఆ ప్రఖ్యాత రచయిత సుపుత్రుడు రవి. ప్రస్తుతం ఎనిమిదవ క్లాసు. ప్రస్తుతం వాడికి పరీక్షలు జరుగుతున్నాయి.

అప్పుడే ఏదో కథ వ్రాయడం ముగించి పోస్టు చేద్దామని బయల్దేరాడు రామనాథం.

ఏడుస్తూ ఇంటికొచ్చాడు రవి.

"ఎందుకురా కన్నా ఏడుస్తున్నావ్? అప్పుడే వచ్చేశావేం బడి నుంచి" ఆత్రుతగా ప్రశ్నించాడు రామనాథం.

"టీచరు ఇంటికి పంపించింది నాన్నా!" వెక్కుతూ అన్నాడు రవి.

### 'పైకొచ్చే రచయిత'



"ఎందుకనమ్మా!" బుజ్జగిస్తూ అడిగాడు.

"మరే! తిట్టింది కూడా నాన్నా!"

"తిట్టిందా?" ఆశ్చర్యంగా అడిగాడు రామనాథం.

"దొంగ వెధవ-అన్నీ తండ్రి బుద్ధులే అని తిట్టింది నాన్నా"-తండ్రి ముఖంలోకి చూస్తూ చెప్పాడు రవి.

నిర్ఘాంతపోయాడు రామనాథం. తేరుకుని అడిగాడు నెమ్మదిగా—

"ఎందుకు తిట్టిందిరా మీ టీచర్"

"మరే! ప్రశ్నలకు జవాబు తెలీకపోతే మురళి పేపరు చూసి రాస్తున్నా నాన్నా! అందుకు తిట్టింది" అసలు కారణం బయటపెట్టాడు.

"పైకొచ్చే రచయితను పట్టుకుని అలా తిడుతుందా! రేపు నేనొచ్చి మాట్లాడతాగాని నువు చదువుకోరా కన్నా"- కథ పోస్టు జేయడానికి బయల్దేరాడు రామనాథం.

—దీప్తి